



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పుల్లారెడ్డి

అందరివాడు.. సోమిశెట్టి

- కుడా చైర్మన్ ప్రమాణస్వీకారంలో మంత్రులు ఎన్ఎండి.ఫరూక్, టిజి.భరత్
- కుడాను ప్రగతి పథంలో నడిపిస్తా : సోమిశెట్టి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

టిడిపి అభివృద్ధికి సుదీర్ఘకాలంగా సేవలందిస్తూ మన్ననలు పొందిన అందరివాడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్, పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, టిడిపి నాయకులు అన్నారు. సోమవారం సుంకేసుల రోడ్డులోని ఎమ్మార్సీ ఫంక్షన్ హాలులో కుడా చైర్మన్ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా న్యాయశాఖ మంత్రి మాట్లాడుతూ... టిడిపికి సుదీర్ఘకాలంగా అధ్యక్షుడిగా పనిచేసిన ఘనత సోమిశెట్టి వెంకటేశ్వర్లుకే దక్కుతుందన్నారు. నిబద్ధత కలిగిన వ్యక్తి అని అన్నారు. పార్టీలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ప్రతిపక్ష పార్టీల దాడులకు ఎదురొడ్డి నిలిచాడు అన్నారు. పార్టీలో సోమిశెట్టికి తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. సొంత డబ్బులతో, పార్టీ నిధులతో కార్యాలయాన్ని నిర్మించామన్నారు. అనేక ఏళ్లుగా చంద్రబాబు నాయుడుకు కర్నూల్లో రాజధానిని కోల్పోయిందని దాన్ని భర్తీ చేయడానికి కనీసం హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని పదేపదే చెప్తూ వచ్చామన్నారు. మంత్రి టిజి.భారత్ మాట్లాడుతూ... సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు కుడా చైర్మన్ పదవి లభించడం తన ఇంట్లో వారికి వచ్చినట్లు భావించానని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయడం వల్లే ఆయనకు ఆ పదవి దక్కిందని అన్నారు. ముఖ్యమంత్రి పత్తికొండలో సభను నిర్వహించిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కర్నూలుకు హైకోర్టు బెంచ్‌ను ప్రకటించారన్నారు. మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిపై కొంతమంది న్యాయవాదులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. జిల్లా అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. మాజీ డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పార్టీలో ఎన్ని గ్రూపులు ఉన్నా అందరినీ కలుపుకొని పనిచేసే వ్యక్తి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అని అన్నారు. పార్టీలో నమ్మకమైన వ్యక్తిగా ఉన్నాడు కాబట్టే ఆయనకు రెండోసారి ఈ అవకాశాన్ని ముఖ్యమంత్రి కనిపించారన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపుని ఇచ్చే పార్టీ టిడిపి అన్నారు. తనను తన సేవలను గుర్తించి రెండోసారి అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు టిజి.భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితంలో గ్రూప్ తగాదాలకు తావివ్వలేదని కేవలం పార్టీ అభివద్ధి కోసమే పని చేశానని అన్నారు. ముఖ్యమంత్రి తన పట్ల పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాన్ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. కూడా అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో 279 నాన్ లేఅవుట్లు, 900 పైగా గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటన్నిటిని సరిచేసే కార్యక్రమాన్ని మరో 10 రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిని ఎవరిని వదిలిపెట్టబోమన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, ఎమ్మెల్యేలు గౌరుచరిత, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, జయనాగేశ్వర్ రెడ్డి, కెఇ.శ్యాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు మీనాక్షి నాయుడు, కోట్ల సుజాతమ్మ, ఏరాసు ప్రతాపరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, బోయ కురువ, రజక కార్పొరేషన్ల చైర్మన్లు బొజ్జమ్మ, దేవేంద్రప్ప మాట్లాడారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకరర అధ్యక్షత వహించారు. టిడిపి నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి నవీన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, టిడిపి సీనియర్ నాయకులు కెవి.సుబ్బారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్, కార్పొరేటర్లు గంపల పరమేష్ కే పద్మలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమిశెట్టితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి ఫరూక్

అదానీలాంటి సంపన్నుల కోసం

పేదలపై భారాలు తగదు

- విద్యుత్ ఒప్పందాల అవినీతిపై విచారణ జరిపించాలి
- పిపిఎస్ఎస్ , వివిధ సంఘాలు విద్యుత్ భవన్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అదానీ అవినీతి పాలకుల ఆదాయం కోసం పేద మధ్యతరగతి కుటుంబాలపై ట్రూఆప్ విద్యుత్ చార్జీల పేరుతో భారాలు వేయడం సరికాదని పట్టణపౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.పుల్లారెడ్డి అన్నారు. సోమవారం కర్నూలు విద్యుత్ భవన్ ముందు పట్టణ పౌర సంక్షేమ సంఘం(పిపిఎస్ఎస్), పేదకాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో ట్రూఆప్ ఛార్జీల భారాలను నిరసిస్తూ ధర్నా చేశారు. విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని, ట్రూఆఫ్ ఛార్జీలు రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పిపిఎస్ఎస్ నాయకులు ఎం.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో పెట్రోల్ బంకుల యజమానుల సంఘం జిల్లా అధ్యక్షులు జె.సురేష్, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబ్, నివాస ప్రాంతాల అసోసియేషన్ ప్రతినిధి ఎస్.అన్వర్ బాష, పట్టణపౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడారు. గత నెల ప్రకటించిన రూ.6000 కోట్లతో సహా రూ.11,820 కోట్ల ట్రూఆప్ ఛార్జీలు రద్దు చేయాలన్నారు. అదానీ లాంటి సంపన్నుల ఆదాయంకోసం, కమీషన్లకు కక్కుర్తిపడి అవినీతి పాలకుల కోసంపేద మధ్యతరగతి ప్రజలు, సూక్ష్మచిన్న పరిశ్రమల సంస్థలపై రూ.వేలకోట్లు ట్రూఆప్‌చార్జీల భారం వేస్తారా అని ప్రశ్నించారు. ట్రూఆప్ విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని విద్యుత్ ఒప్పందాల్లో జరిగినఅవినీతి ఆరోపణలపై విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలన్నారు. దేశంలో జరిగే అవినీతి గురించి ఇతర దేశాలు చెప్పేంతవరకు మన పాలకులు నిఘా సంస్థలకు తెలియకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పుడున్న విద్యుత్ ఛార్జీలే చెల్లించలేకపేద, మధ్యతరగతి ప్రజలతోపాటు సూక్ష్మ, చిన్న పరిశ్రమలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ట్రూఆప్‌చార్జీలు రద్దు చేసి కూటమి ప్రభుత్వం మాటపై నిలవాలన్నారు. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా గేటుకు తాళం వేయడంతో అధికారులపై ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డిఇ ఓబులేసు బయటికి వచ్చి వినతిపత్రాలు తీసుకోవడంతో శాంతించారు. చాంబర్ ఆఫ్ కామర్స్, పెట్రోల్ బంకుల యజమానుల సంఘం, రైస్ మిల్లుల యజమానుల సంఘం, మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్, చిన్న వ్యాపారులు, అనేక కాలనీల అసోసియేషన్ల కమిటీలు, పిపిఎస్–ఎస్ నాయకులతో కలిసి విద్యుత్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ ఓబులేష్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ఎపి విద్యుత్ నియంత్రణ మండలికి వినతి పత్రాలు పంపిస్తామని డిఇ హామీ ఇచ్చారు. నాయకులు ఖలీల్ అహ్మద్, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, తిరుపతయ్య, షబ్బీర్, మహమ్మద్‌యూనుస్, సివివర్మ, ఎస్ఆర్‌గౌడు, అస్లాం, శ్రీనివాసులు, పురుషోత్తంరెడ్డి, శశికుమార్‌రెడ్డి, వెంకటనర్సు, పీటర్, రాజు, వెంకటేశ్వర్లు, వన్నూరు సాహెబ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏ ఒక్క దరఖాస్తు పెండింగ్ ఉండరాదు

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఏ ఒక్క దరఖాస్తు కూడా పరిష్కరించకుండా పెండింగులో పెట్టరాదని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆయా శాఖల వారీగా దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూకు సంబంధించి 55 అర్జీలు ఎక్కువ శాతం పెండింగులో ఉన్నాయని వెంటనే అర్జీలను ఓపెన్ చేసి చూడాలన్నారు. పోలీసు శాఖకు సంబంధించి కూడా 30 అర్జీలు ఇంకా ఓపెన్ కూడా చేసి చూడలేదని సంబంధిత అధికారి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే విధంగా రీఓపెన్ కేసులకు సంబంధించి రెవెన్యూలో 10, పోలీసు శాఖలో 5 పెండింగ్ ఉన్నాయని వాటిపై ఫీల్డ్ విచారణ చేసి సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

బీడి కార్మికులకు ఒరిజినల్ పట్టాలు ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట బీడి కార్మికుల ధర్నా
- స్పందించకపోతే వంటావార్పు, ఆందోళన ఉధృతం : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జోహరాపురం వెంకయ్యపల్లిలో బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాల ఒరిజినల్ పట్టాలి వ్వాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వెంకయ్య పల్లె బీడీ కార్మికుల కాలనీవాసులతో ధర్నా నిర్వహించారు. కె.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ధర్నానుద్దేశించి ఎం.రాజశేఖర్, బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ జోహరాపురం పరిధిలో ఉన్న సర్వే నంబర్ 174 ,175, 176, ప్రభుత్వం స్థలాలను కేటాయించిందని అక్కడ నివాసం ఉంటున్న బీడీ కార్మికుల ఇళ్ల స్థలాలకు ఒరిజినల్ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ స్కీం ద్వారా ప్రతి బీడీ కార్మికుని నుండి రూ.ఐదు వేలు డిడి కలెక్టర్ , లేబర్ కమిషనర్ పేరు మీద కట్టిచ్చి నాటి ఎమ్మెల్యేఎంఎ గఫూర్ నాయకత్వంలో ఈ స్కీంను అమలు చేయించారన్నారు. దాదాపు 817 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. వైసిపి నేతలు కొంతమంది కబ్జా కోరులను జత చేసుకొని స్టేటస్కో తీసుకొని దౌర్జన్యంగా ఇళ్ల నిర్మాణాలకు పునాదులు కూడా వేశారన్నారు. తాము కట్టిన బేస్ మట్టాలను దాదాపు 44 పైగా రాత్రికి రాత్రే దౌర్జన్యంగా దొంగల మాదిరిగా మొత్తం చదును చేసి రాళ్లను ట్రాక్టర్లతో ,జెసిబిలతో తీసుకుపోయారన్నారు. ఈ స్థలాలను కబ్జా చేసి వేరే వాళ్లకు అమ్ముతున్నారన్నారు. ఇటువంటి కబ్జా కోరుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. స్పందించకపోతే ప్రజలందరిని సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అవసరమైతే కలెక్టర్ కార్యాలయం ముందే వంటావార్పు చేస్తామని హెచ్చరించారు.. జాయింట్ కలెక్టర్ బి నవ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు మద్దతు తెలిపారు. ఈధర్నా లో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎం డి షరీఫ్, డి.అబ్దుల్ దేశాయ్,నాయకులు మహబూబ్‌బాషా, బీడీ కార్మికుల సంఘం నాయకులు అబ్దుల్, నయీమ్, అన్వర్ , మాలిక్, మక్బూల్, మొఖైయార్, ఎండి నబి, రహంతుల్లా, జాకీర్, చాంద్‌బాష, చిన్న , భూషణమ్మ, చాంద్‌బాష ,రియాజ్ ,హాజీ బాష, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న బీడి కార్మికులు, కాలనీ వాసులు, నాయకులు

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

మంత్రి టిజి. భరత్ -ఎస్ఎపి క్యాంపులో నూతన రహదారి పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి. భరత్ అన్నారు. సోమవారం ఎస్ఎపి క్యాంపులో నూతన రహదారి నిర్మించనున్న ప్రదేశాన్ని మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బళ్ళారి చౌరస్తా కూడలిలో ట్రాఫిక్ తగ్గేందుకు, హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలను కొత్త బస్టాండ్ సమీపంలోకి చేరుకునేలా ఎస్ఎపి క్యాంపు మీదుగా కొత్త రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 40 అడుగుల వెడల్పు, 116 మీటర్ల పొడవుతో రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కిడ్స్ వరల్డ్ సర్కిల్ నుండి ఉస్మానియా కాలేజీ, బుధవారపేట మీదుగా కలెక్టరేట్ వరకు, అంబేద్కర్ సర్కిల్ నుండి రాఘవేంద్ర స్వామి మఠం వరకు రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాజ్ విహార్ సమీపంలోని ఎల్లమ్మ ఆలయం నుండి జమ్మిచెట్టు వరకు హంద్రీ నది తీరాన బంక్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, డిఎస్పి మాహబూబ్ బాష, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు, పోలీసులకు ట్రాఫిక్ ప్రణాళిక వివరిస్తున్న మంత్రి టిజి.భరత్

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా పోరాటం

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం కల్లూరు మండల మహిళా సమాఖ్య ఆఫీస్‌లో జెండర్ అంశాల పైన పలువురు అధికారుల సమన్వయంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కల్లూరు ఎంపిడిఒ, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఎపిఎం పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈనెల 25 నుండి డిసెంబర్ 23 వరకు జరుగు పలు కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎపిఎంఒ పుష్పావతి కోరారు. గ్రామాలలో జెండర్ ర్యాలీలు, అంతర్గత ఫిర్యాదుల కమిటీని బలోపేతం చేయడం స్వయం సహాయక సంఘాల చేత జెండర్ ప్రచారం చేయడంవంటివి చేయాలన్నారు.



జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రచారానికి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పి జి.బిందుమాధవ్

ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి: ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పి ఆదేశించారు. కర్నూలు ఎస్పి క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 107 ఫిర్యాదులు వచ్చాయి.

పేదల నివాసాలు ఖాళీ చేయించొద్దు : సిపిఎం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్: కర్నూల్ నగరంలో బఫర్ జోన్ పేరుతో హంద్రీ నది పరివాహక ప్రాంతం పక్కన వున్న ముజఫర్ నగర్, సుందరయ్య నగర్, గంగావతి నగర్ కన్యకా పరమేశ్వరి నగర్ ప్రాంతంలో పేదల నివాసాలను ఖాళీ చేయించకుండా చూడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు , జిల్లా కమిటీ సభ్యులు సి గురు శేఖర్ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప, నాయకులు యస్ ఉసేన్‌బాషా, ఎస్. షంషీర్, ఎస్. ముక్తి యార్ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. టి రాముడు, కె సుధాకరప్ప మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పేద ప్రజలు చిన్న చిన్న ఇల్లు కట్టుకొని ఇండస్ట్రియల్ స్టేట్ ప్రాంతంలోని ఫ్యాక్టరీలలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇంటి పన్నులు కడుతూ మున్సిపల్ అధికారులు అనేక సౌకర్యాలు ఇక్కడ ఏర్పాటు చేశారని తెలిపారు గత వారం రోజులుగా సర్వే పేరుతో రెవెన్యూ సచివాలయ అధికారులు వచ్చి మీ ఇళ్లను ఖాళీ చేయాలని చెప్పడంతో అక్కడ ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారన్నారు. ఎక్కడో ఆక్రమించుకున్న వారిని వదిలివేసి ప్రశాంతంగా ఇక్కడ జీవిస్తున్న వారిని సర్వే పేరుతో భయభ్రాంతులను గురిచేయడం ఏమిటని అధికారులను సిపిఎం నాయకులు ప్రశ్నించారు. వెంటనే బఫర్ జోన్‌లో చేస్తున్న సర్వే ఆపివేసి ప్రజలు అక్కడే ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య మాట్లాడుతూ ప్రస్తుతం సర్వే చేస్తున్నామని ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

సిపిఎం నేత రాజగోపాల్‌కు సతీవియోగం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సిపిఎం మాజీ కార్పొరేటర్ టి.రాజగోపాల్‌కు సతీమణి నాగమణి మృతిచెందారు. రాయలసీమ పేపర్ మిల్లు కార్మిక పోరాటాల్లో పాలుపంచుకునే సమయంలో మహిళా కార్యకర్తగా ఉద్యమంలో తనదైన శైలిలో చురుకైన పాత్ర పోషించారు. సిఐటియు ఉద్యమ నాయకుడిగా భర్త రాజగోపాల్ చేసిన అనేక పోరాటాలు ఆమె వెన్నంటి ఉంటూ సహాయ సహకారాలు అందించారు. పేపర్ మిల్లు ఉద్యమంలో భర్తపై శత్రువర్గాలు హత్యాయత్నం చేసిన సందర్భంలోనూ ఆమె ఆయనకు కంటికి రెప్పలా ఉంటూ సేవలందించారు. గత కొంతకాలంగా ఆమెక్యాన్సర్ సమస్యతో ఇబ్బంది పడుతూ ఇటీవల ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి నివాళి : సోమవారం నాగమణి భౌతికకాయానికి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీఅండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. సిఐటియు సీనియర్ నాయకులు బసయ్య, ఐలు జిల్లా అధ్యక్షులు సింగరాజు లక్ష్మణ్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, సిబ్బంది ఎల్లాగౌడు, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న గౌస్ దేశాయి, తదిరుతలు

మద్దికేర వీధులలో దుర్వాసన

పారిశుధ్యం పట్టని పంచాయతీ అధికారులు

దోమల బెడదతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేరంత పల్లె లేదు.. బళ్లారి అంత పట్టణం లేదు...అనేది దశాబ్దాలుగా జిల్లాలో నానుడి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే మద్దికేర పంచాయతీ చాలా పెద్దది. ఈ పంచాయతీలో దాదాపు పదివేల జనాభా ఉంది. నగర పంచాయతీస్థాయిలో ఉన్న మద్దికేరలో పారిశుధ్యం లోపించింది. గ్రామంలో చాలా వీధులలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తుంది. వివిధ రూపాల్లో లక్షల్లో ఆదాయం వస్తున్నా పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టడంలో ఘోరంగా విఫల మయ్యారని అర్థమవుతుంది. గ్రామంలో చాలా వీధుల్లో కంపువాసన ప్రజలు భరించలేక పోతున్నారు.

లోపించిన పారిశుధ్యం



కురువ వీధిలోని పాఠశాల ముందు పేరుకున్న మురుగు

మద్దికేర గ్రామంలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో పారి శుధ్యం లోపించింది. నాగుల పాయి వీధిలో ఉన్న మురుగు కాలువలో మురుగు పేరుకు పోవడంతో దుర్వాసనను స్థానికులు భరించలేకపోతున్నారు. మాలవీధి సమీపంలో ఉన్న కుంటలోకి మురుగునీరు వచ్చి చేరుతుండటంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. బెస్తవీధి వద్ద ఉన్న కాలువలో మురుగునీరు నిలిచిపోయింది. బ్యాంకు దగ్గర ఉన్న మురుగు కాలువలో రాళ్లు అడ్డు పడడంతో మురుగునీరు నిలిచిపోయింది. ఎంపిపి పాఠశాల దగ్గర ఉన్న రెండు కాలువలు శుభ్రం చేయక పోవడంతో కంపు వాసనను విద్యార్థులు భరించలేక పోతున్నారు.

దోమల బెడదతో ప్రజలు బెంబేలు

మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు బేడదను ప్రజలు భరించలేక పోతున్నారు. కొన్ని వీధుల్లో ప్రజలు దోమల బెడదకు రాత్రంతా జాగరణ చేయాల్సి వస్తుంది. దోమల బారిన పడి ప్రజలు మలేరియా, డెంగీ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ మధ్యకాలంలో గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు పదుల సంఖ్యలో వస్తున్నారు.



ఎస్‌సి వీధిని ఆనుకుని ఉన్న మురుగు కుంట


వాసన భరించలేక పోతున్నాం: మల్లికార్జున



మా వీధిలో మురుగు కాలువలు పేరుకు పోయాయి. మురుగ కాలువలో చెత్త నిండుకపోవడంతో దుర్గంధ వాసన వస్తుంది. ఆ కంపు వాసనకు అన్నం కూడా తినలేని పరిస్థితి ఉంది.

పారిశుధ్యంపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

బురుజుల రాముడు : సిఐటియు



గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంలోపంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా వీధిలో మురుగు కాలు వలు పేరు పోయాయి. రాత్రి పూట దోమల బెడద ఎక్కువగా ఉంది.చాలామంది ప్రజలుజ్వరాల బారినపడి ఇబ్బందులు పడుతున్నారు. .



వినతులను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి -ఆదోని

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జిదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేనెంబర్ 288లో 1.50 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం ఆ భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదయిందని, విచారణ చేసి తన పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన కిష్టప్ప కోరారు. అలాగే సర్వేనెంబర్ 15, 13లో తనకు 14.33 ఎకరాల భూమి ఉందని, ఆ భూమి వెళ్లడానికి రస్తాను ఆక్రమణ చేస్తున్నారని, విచారణ చేసి తమ పొలాలకు వెళ్లేందుకు రస్తా ఏర్పాటు చేయాలని మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామానికి చెందిన డుల్లయ్య కోరారు. అలాగే సర్వేనెంబర్ 185/4లో 1.98, సర్వే నెంబర్181/3లో 0.50 ఎకరాలు, సర్వేనెంబర్183లో 1.60 ఎకరాలు, సర్వేనెంబర్184లో 0.35 ఎకరాల భూమి మొత్తం 4.43 ఉండగా ఆ భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన లింగన్న కోరారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డిఎల్‌డిఒ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

రౌడూరులో గంజాయి

- కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - కౌతాళం



గంజాయి మొక్కను చూపుతున్న పోలీసులు

కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడూరు గ్రామంలో పచ్చని పంట పొలాల్లో గంజాయి సాగు వెలుగు చూసింది. కర్ణాటక సరిహద్దుల్లో గంజాయి మొక్కలు సాగు అవుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం రాత్రి పరుగులు తీశారు. కేసు నమోదు చేయడానికి యంత్రాంగం తర్జనభజన పడినట్లు తెలిసింది. పట్టుబడిన గంజాయి ఎంత విలువ చేస్తుంది..? గంజాయి బరువు ఎంత ఉందో వెల్లడించలేదు. పంచనామా కార్యక్రమం పాత్రికేయులకు సమాచారం ఇవ్వకుండానే నిర్వహించడం పట్ల అనుమానాలకు దారితీస్తోంది. సిఐ అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామ పరిధిలోని పంట పొలాల్లో 183 గంజాయి మొక్కలను గుర్తించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన బోయ గిడ్డయ్య, రఘు వర్ధన్ రెడ్డి, మాల వీరేష్ వీరేష్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎఐ శేషాద్రి, ఎక్సైజ్ శాఖ అధికారుల సమక్షంలో పంచనామా చేసి 182 మొక్కలను అక్కడే దహనం చేశామన్నారు. ఒక గంజాయి మొక్క శ్యాంపిల్‌గా స్వీకరించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

మానవతా దృక్పథం పెంపొందాలి

- ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష

ప్రజాశక్తి - కౌతాళం



సరుకులను అందజేస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

మానవతా దృక్పథంతో సహాయ, సహకారాలు అందించడం.. గొప్ప నైతిక విలువలు కలిగి ఉండడమేనని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష తెలిపారు. సోమవారం ఆదోనిలోని జీవనజ్యోతి వృద్ధాశ్రమానికి వెళ్లి ఇక్కడ ఉన్న అనాథ వృద్ధులకు పదో తరగతి విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం కలిసి నిత్యావసర వస్తువులను అందించారు. అనాథలకు, అనారోగ్యం ఉన్న వారికి, శక్తిమేర సహాయ, సహకారాలు అందించాలని కోరారు. భవిష్యత్తులో విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సూచించారు. పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, జయలక్ష్మి, శిరీష, నాగరాజు, జయరాం పాల్గొన్నారు.

వాట్సాప్‌లో మట్కా నిర్వహణ..!

- **ఇద్దరు ప్రధాన నిర్వాహకుల అరెస్టు**
- **రూ.2,15,600లు, 10 లీటర్ల నాటుసారా సీజ్**

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మూడో పట్టణ పోలీసు స్టేసన్ పరిధిలో ఆన్‌లైన్‌లో వాట్సాప్ గ్రూపుల ద్వారా మట్కా నిర్వహిస్తున్న ఇద్దరు ప్రధాన నిర్వాహకులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2,15,600, 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఆదోని డీఎస్పీ సోమన్న, త్రీ టౌన్ సిఐ రామలింగయ్య తెలిపారు. సోమవారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగదు, ఫోన్లను ప్రదర్శించి, ప్రధాన నిందితులు ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన వై.శ్రీకాంత్ రెడ్డి, ఆదోని పట్టణం హవన్న పేటకు చెందిన షేక్ చకోలి చాంద్ బాషను హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సోమన్న

డీఎస్పీ మాట్లాడారు. పట్టణంలో కొందరు మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఈనెల 1న త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మున్ని ఆలీ హుస్సేన్, ఈరప్పను అరెస్టు చేసినట్లు చెప్పారు. 15 లీటర్ల నాటు సారా, రూ.35,500 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో భాగంగానే ఇంకా కొంతమంది నిందితుల గురించి వచ్చిన సమాచారం మేరకు సోమవారం ఆదోని, ఆస్పరి బైపాస్ రోడ్డులోని ఎంజి బ్రదర్స్ వెంచర్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఆలూరు మండలం కమ్మరిచేడు గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డిని, ఆదోని పట్టణం హవన్న పేటకు చెందిన షేక్ చకోలి చాంద్ బాషను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. శ్రీకాంత్ రెడ్డి సుమారు 15 ఏళ్ల నుంచి బళ్లారిలో ఉంటూ సాయి రిఫ్రిజిరేషన్స్ పేరు మీద రిఫ్రిజిరేషన్ వర్క్ వ్యాపారం చేసేవాడని, కొన్నేళ్ల నుంచి జల్సాలకు అలవాటు పడి.. అప్పులు చేశాడని తెలిపారు. అప్పులు తీర్చేందుకు అక్రమంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని.. మట్కా వ్యాపారం చేసేందుకు నిర్ణయించుకున్నాడని చెప్పారు. ఇంతకు ముందు ఆదోనిలో మట్కా నిర్వహిస్తున్న ఆలీ హుస్సేన్, చాంద్ బాషతో మాట్లాడుకొని వారిని నుంచి రోజూ మట్కా నుంచి లావాదేవిలు నిర్వహించేవాడని తెలిపారు. నాటుసారా వ్యాపారం కూడా చేస్తూ వారితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, మట్కా లావాదేవీలు, రోజువారి మట్కా లెక్కలు, మిగతా మట్కా ఆటకు సంబంధించిన విషయాలు ఆ గ్రూపులో చర్చించుకునేవారని చెప్పారు. ఈనెల 1న ఆలీ హుస్సేన్, ఈరప్పను పట్టుకొని, మట్కా డబ్బు, సారాను స్వాధీనం చేసుకొని, రిమాండుకు పంపినట్లు తెలిపారు. అలాగే మట్కా ప్రధాన నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, చాంద్ బాష కోసం గాలిస్తున్నట్లు తెలుసుకుని ఆదోనికి వచ్చి లాయర్‌తో మాట్లాడి మట్కా డబ్బులతో నాటుసారా కొనుగోలు చేశారని, వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.2,15,600ను, మట్కా ఆడేందుకు ఉపయోగించిన సెల్ ఫోన్, రెండు క్యాన్లలో ఉన్న 10 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్లు వివరించారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

- రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం తహశీల్దార్ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు పరమేష్ మాట్లాడారు. మండలాన్ని కరువుగా ప్రకటించినా మిరప రైతులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధర లేక మిరప, వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు రూ.20 వేలు తక్షణమే అందించాలని కోరారు. ప్రతి రైతుకూ రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం నాయకులు తిక్కన్న, పరమేష్, శ్రీనివాసులు, ఓబులేసు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రమాణ స్వీకారానికి టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు నగరంలో టిడిపి సీనియర్ నాయకులు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకార మహోత్సవానికి టిడిపి నాయకులు బయల్దేరి వెళ్లారు. సోమవారం ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి పార్టీ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. సుమారు 20 వాహనాల్లో నియోజకవర్గ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు.



జెండా ఊపుతున్న ఎమ్మెల్యే బీవీ

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌పై కేసు పెట్టడాన్ని నిరసిస్తూ జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. సోమవారం పట్టణంలోని భీమా సర్కిల్ నుంచి ఎపియుడబ్ల్యుజె, ఎపిడబ్ల్యుజెఎఫ్ పట్టణ జర్నలిస్టులు భారీగా తరలివచ్చి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ సోమన్నకుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... టిడిపి నాయకులు గుడిసె కృష్ణమ్మ అండతో తన అనుచరుడు మహాదేవ్ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆంధ్రజ్యోతి పత్రికలో కథనాన్ని ప్రచురించినట్లు తెలిపారు. అక్రమాలు చేయలేదని నిరూపించుకోవాల్సింది పోయి నిజాన్ని వెలికి తీసిన జర్నలిస్టుపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సిగ్గు చేటన్నారు. ఎపియుడబ్ల్యుజె అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, హుస్సేన్, నాయకులు దేవదాసు, గౌస్, దశరథ, రాము, విజయేంద్రనాథ్, ప్రసాద్, చిన్న, రవికుమార్, ముగ్దుమ్, చార్లెస్, మహేష్, గిరిబాబు, ఎపిడబ్ల్యుఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజు, మునెప్ప, విజయ్, ఖాన్, పురుషోత్తం, భీమా, మురళీ, వీరేష్, నరసింహ, జాప్ నాయకులు సునీల్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కోటకొండ గ్రామంలోని శ్రీజ్యోతి టాలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో సోమవారం ఆహారం- ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ధన్వంతరి జయంతి వార్షికోత్సవాల సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, ఆహార అలవాట్లు, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య భారతి జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవేణి, పాఠశాల కరస్పాండెంట్ ఎం.తిప్పన్న విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు హరికృష్ణ, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి

- గంగపుత్రుల సంఘం అధ్యక్షులు హండే శాంతయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో ఉండే గంగపుత్రులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని గంగపుత్రుల సంఘం మంత్రాలయం అధ్యక్షులు హండే శాంతయ్య తెలిపారు. సోమవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కార్తీక వనభోజనం నిర్వహించారు. అంతకుముందు తుంగభద్ర నదీతీరంలో వెలసిన గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి, మంగళహారతి ఇచ్చారు. అనంతరం ప్రత్యేక వాహనంపై గంగమ్మమాత, భీష్మ మహర్షి చిత్రపటాలను ఉంచి మహిళలు, కలషాలతో యువకులు డప్పుల మధ్య శ్రీరామ సర్కిల్, రాఘవేంద్ర సర్కిల్, జాతీయ రహదారి మీదుగా గ్రామ శివారులోని ఉసిరి వనం వరకు ఊరేగించారు. అనంతరం మహిళలు ఉసిరి వనంలో ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండగ వాతావరణంలో గంగపుత్రుల వన భోజనం ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, గంగపుత్రులు సభ్యులు హండే హనుమంతు, బంగి భీమయ్య, బొంబాయి శివ, కంతం నరసింహులు, వట్టెప్పగారి చిన్న సుంకప్ప, నరసింహ పాల్గొన్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న గంగపుత్రులు

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE : DHONE
O.S.NO.135/2024

Andhra Pragathi Grameena Bank
Rep by its branch manager, Veldurthi. ..Plaintiff
-VS-
1.యడపల్లి మధుశేఖర్ రెడ్డి,
తండ్రి మద్దిలేటి రెడ్డి,
R/o సూదేపల్లి గ్రామం,
వెల్దుర్తి మండలం,
కర్నూలు జిల్లా. ...ప్రతివాది నెం.1

1వ ప్రతివాదికి సమన్స్

పై దావాను బ్యాంకు వారు క్రాప్‌లోన్ వసూలు కోసం దావా దాఖలు చేసినారు. నీవు కోర్టు సమన్స్ తీసుకొనక తప్పించుక తిరుగుతున్నావు. కావున పై కోర్టు నందు 12.12.2024 తేదిన ఉ॥10.30 గంటలకు నీవు కాని నీ తరపున వకీలు కాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొవచ్చును. లేనంతట నీ పరోక్షమందు తీర్మాణించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది : 12-12-2024

M.GOPAL REDDY, B.com, B.l.,
Advocate,
Dhone, Nandyla District,
Cell : 9440557898

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

- కెజిబిఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కెజిబిఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్, ఛర్మ కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోని, కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.తిమ్మన్న, చిన్నప్ప డిమాండ్ చేశారు. సోమవారం కెజిబిఎస్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాటికారులను ప్రభుత్వాలు ఇప్పటికీ ఒక వృత్తిగా గుర్తించకపోవడం దుర్మార్గమని తెలిపారు. వెంటనే వృత్తిగా గుర్తించడంతోపాటు వృత్తిని నిర్వహించే కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. గ్రామానికి చాలినంతా శ్మశాన వాటిక లేకపోయినా.. గతంలో పూడ్చిన చోటే తిరిగి తవ్వి మృతదేహాలను పూడ్చుతున్నారని తెలిపారు. కాటికాపరులకు ఎలాంటి ఆరోగ్య బీమా, ప్రమాద బీమా లేవన్నారు. ప్రభుత్వం వెంటనే ఉచితంగా బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శ్మశాన సమస్యలతో పాటు అందులో పని చేసే కాటికాపరుల సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వాలు కూడా సమస్య పట్ల స్పందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఛర్మ కళాకారుల సంఘం నాయకులు సుమల రాజు, కెవిపిఎస్ నాయకులు అరుణ్, డప్పు కళాకారుల సంఘం నాయకులు చిన్న దేవేంద్ర, మున్సిపాలిటీ నాగరాజు, మున్సిపాలిటీ తిక్కయ్య, వీరేష్, కాటికాపరులు వీరేష్, ఈరన్న, మల్లన్న, గోవిందు, నరసన్న, లక్ష్మన్న, ఆనంద రాజు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపడుతున్న నాయకులు

సుందరంగా పట్టణం

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సెంట్రల్ లైటింగ్ పూర్తి కావడం వల్ల పట్టణం సుందరంగా తయారవుతోందని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ట్యాంక్ బండ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ లైటింగ్ పనులు జనవరిలో శ్రీనీలకంఠేశ్వర జాతర ప్రారంభమయ్యేలోపు పూర్తి చేస్తారని, పట్టణానికి కొత్త శోభ వస్తుందని ఆయన తెలిపారు.

స్వర్ణమయమైన రాఘవేంద్రుని బృందావనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం తెల్లవారుజామున రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలమాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకుని నైవేధ్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- దేవనకొండ

కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవనకొండ మండలంలోని కోటకొండ గ్రామంలోని రాంభవి రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో లక్ష్మీ కౌలుట్ల చెన్న కేశవ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ కోటకొండ హనుమంతు రెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం, బిల్వార్చన, రుద్రాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. కురువ రామలింగయ్య, ధనుంజయ, రంగడు, హరి, మధు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి

- మండల అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

సమాజంలో లింగ వివక్షను రూపుమాపినప్పుడే ప్రజల్లో అసమానతలు తొలగిపోతాయని ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఇఒఆర్‌డి బాలన్న, ఎంఇఒ-2 శ్రీనివాస్ రెడ్డి, ఎపిఎం నాగార్జున తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో డిఆర్‌డిఎ, సెర్ప్ ఆదేశాల మేరకు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా వివక్షను రూపుమాపాలని మండల అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ట్రాన్స్ జెండర్‌లను, మహిళలను కించపరిచే విధంగా ఎవరు మాట్లాడినా నేరమన్నారు. ప్రజలందరూ అసమానతలు లేని సమాజం నిర్మించుకోవాలని కోరారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, హౌసింగ్ అధికారి భవ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, అస్పిరేషనల్ అధికారి లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శులు జయరాం నాయక్, సురేంద్ర, నరసింహులు, ప్రమీల, వెలుగు సిసి లక్ష్మన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు. **దేవనకొండ**లోని ప్రధాన రహదారుల గుండా హైస్కూల్ బాలికలు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ లోకేశ్వరరావు, ఎంపిడిఒ గౌరీదేవి అందరితో ప్రతిజ్ఞ చేయించా రు. ఎఒ సురేష్ బాబు, మండల సమాఖ్య అధ్యక్షులు వెంకటలక్ష్మి, సిసిలు నరసన్న, ప్రభాకర్, మస్తాన్, యంగన్న, స్వామన్న, ముద్ద రంగడు పాల్గొన్నారు.



చిప్పగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



దేవనకొండలో...



ప్రతిజ్ఞ చేయిస్తున్న సిఐ

బాల్య వివాహాల నివారణకు కృషి

- ఎంపిడిఒ మణిమంజరి, సిఐ గంగాధర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

బాల్య వివాహాల నియంత్రణతో పాటు బాలిక హింసకు వ్యతిరేకంగా గ్రామైక్య సంఘాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు కృషి చేయాలని ఎంపిడిఒ మణిమంజరి, సిఐ గంగాధర్ తెలిపారు. గోనెగండ్లలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. వివాహాల నిర్మూలన పాఠశాలల్లో డ్రాపౌట్స్ నివారణ, జెండర్ ఆధారిత హింస, హింసాత్మక రూపాలు, అందుబాటులో ఉన్న చట్టాలు, ప్రభుత్వ పథకాలు, మానవ అక్రమ రవాణా నుంచి ప్రభావితమైన మహిళలు, పిల్లలకు గుర్తింపు, హింసకు వ్యతిరేకంగా పోరాటానికి స్వయం సహాయక సంఘాలు సమాఖ్యల పాత్రలు, బాధ్యతలు, వివిధ శాఖలతో సమన్వయంపై అంశాలపై చర్చించారు. గ్రామాల్లో జెండర్ ర్యాలీలు, అంతర్గత ఫిర్యాదుల కమిటీని బలోపేతం చేయడం, స్వయం సహాయక సంఘాల చేత జెండర్ ప్రచారం చేయడం వంటివి చేయాలని తెలిపారు. సర్పంచి హైమావతి, ఎంపిటిసి రజియా సుల్తానా, ఎపిఎం హేమలత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, సిసిలు రమేష్, మౌలాలి, శ్రీనివాసులు, జయన్న పాల్గొన్నారు.

దళారులను నమ్మవద్దు

- తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్

ప్రజాశక్తి - చిప్పగిరి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పొందడం కోసం దళారులను ఆశ్రయించ వద్దని తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకుల రవి యాదవ్ లబ్ధిదారులకు సూచించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇల్లు లేని వారందరికీ త్వరలోనే ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు అధిక మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా, కేంద్ర ప్రభుత్వం వాటాను పెంచి ఇవ్వటానికి సిద్ధమైందన్నారు. ఈ నేపథ్యంలో ఎవరూ దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని లబ్దిదారులను కోరారు. అలాగే కొత్త పింఛను పొందడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటికి కావాల్సిన పత్రాలను ఇవ్వడానికి లబ్ధిదారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. వీరభద్ర గౌడ్ సహకారంతో మండలం అభివృద్ధి పథంలో పయనిస్తోందని చెప్పారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఇరుకు రోడ్ల వల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆదోని ప్రెసిడెంట్ గౌస్ ఖాన్ కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ట్రాఫిక్ వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని, ప్రమాదాలు కూడా ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. మున్సిపల్ మెయిన్ రోడ్, రోషన్ లార్డ్స్ రోడ్, షాహి జామియా మస్జిద్ రోడ్డు ప్రాంతాలు ఎప్పుడూ రద్దీగా ఉంటున్నాయని, ట్రాఫిక్ పోలీసులు వచ్చి క్రమబద్ధీకరించాలని కోరారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అదానీతో చీకటి ఒప్పందాలు రద్దు చేయాలి: సిపిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రపంచ ఆర్థిక నేరస్తులు గౌతమ్ అదానీని అరెస్టు చేసి ఎపిలో కుదుర్చుకున్న అన్ని రకాల చీకటి ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, సహాయ కార్యదర్శి సమీవుల్లా కోరారు. సోమవారం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భారతదేశంలో కేంద్ర పాలిత ప్రాంతంతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒరిస్సా, ఛత్తీస్‌గడ్, ఐదు రాష్ట్రాలకు సంబంధించిన ముఖ్యమంత్రులకు అదానీ లంచాలు ఇచ్చినట్లు అమెరికా న్యూయార్క్ కోర్టులో కేసు నమోదు చేసి అరెస్టు వారెంట్ కూడా జారీ అయిందని తెలిపారు. గౌతమ్ అదానీ నుంచి గత ముఖ్యమంత్రి జగన్‌కు 2021 ఆగస్టు 7న రూ.1,750 కోట్ల ముడుపులు ముట్టినట్లు నిర్ధారణ అయిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ పరువు, ప్రతిష్టను మంటగలిపిన అదానీని అరెస్టు చేయాలని కోరారు. ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోడీ నైతిక బాధ్యత వహించాలన్నారు. ఈ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని కోరారు. సిపిఐ నాయకులు బజారి, కెసి.జబ్బార్, దాదావలీ, తిమ్మగురుడు, మాలిక్, విజేంద్ర, నరసింహులు, మల్లికార్జున గౌడ్, ఖాజా, నరసింహ గౌడ్, వీరాంజిగౌడ్, రమేష్, వీరేంద్ర, ఇస్మాయిల్, శంకర్, మద్దిలేటి, నరసింహులు, ఖాజా హుస్సేన్, నబి సాబ్, రాము, గోపాల్, ఖాదర్, సమీర్, విజయ్, శేఖర్, హనుమంతు, జయరాజ్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న నాయకులు

చదువులో పోటీతత్వం పెరగాలి

- ఎంఇఒ శ్రీనివాస్ రెడ్డి



ఎంఇఒ శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న యాజమాన్యాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

చదువులో విద్యార్థులకు పోటీతత్వం ఉంటేనే మెరుగైన ఫలితాలు సాధించటానికి ఆస్కారం ఏర్పడుతుందని ఎంఇఒ-2గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఇఒ-2గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ రెడ్డిని హాజీ మలాంగ్ బాబా పాఠశాల కరస్పాండెంట్ బాబా, చిప్పగిరి భం భం బాబా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మాస్ వలీ, విజయ విట్టల ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులు, నెట్టికల్లు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 334/2023

సిహెచ్ రాధమ్మ వగైరాలు ..వాదులు
వర్సస్
గురుశెట్టి శ్రీనివాసరావు వగైరాలు ..ప్రతివాదులు

To,
1వ ప్రతివాది చిరునామా
గురుశెట్టి శ్రీనివాస రావు తండ్రి లేట్ శ్యామ్ సుందర్, హిందూ, వయస్సు 43 సంవత్సరాలు, ఉద్యోగి, నివాసం : డోర్ నెం ఈ-32, యుటిసిఎల్, అల్ట్రా టెక్ టౌన్ షిప్, తుమ్మలపెంట గ్రామం, కొలిమిగుండ్ల మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబరు దావాలో వాదులు మీ నుండి దావా పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 06-12-2024న వాయిదా వుండినది. కావున మీరు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించ బడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 24-11-2024 ఇట్లు
శ్రీ భూపని వెంకటేశ్వర రావు,
వాదుల తరపు న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No : 37/2023

కట్టా లక్ష్మి .. వాది
వర్సస్
పోలా పెద్ద ఆంజనేయులు
అలియాస్ ఆంజనేయులు వగైరాలు ..ప్రతివాదులు

To,
5వ ప్రతివాది చిరునామా
బోయ సావిత్రి భర్త లేట్ ఆంజనేయులు,
వయస్సు 53 సంవత్సరాలు, హిందూ,
ఎస్టి ఏరుకుల కులం, గృహిణి,
స్థానిక నివాసం: గిద్దలూరు గ్రామం,
ప్రస్తుత నివాసం : బంగారుపేట,
కర్నూలు పట్టణం మరియు మండలం,
కర్నూలు జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ నుండి దావా పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ:19-12-2024న వాయిదా వుండినది. కావున మీరు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్ష మందు సదరు దావాను విమర్శించి తీర్మానించ బడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 24-11-2024 ఇట్లు
శ్రీ భూపని వెంకటేశ్వర రావు,
వాది తరపు న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.